క్లుప్తంగా

నేడు ఆర్టీసీ బస్సును ప్రారంభించనున్న మంత్రి

పుంగనూరు: రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం పుంగనూరులో పర్యటిస్తారని వైఎస్సార్‌ ఆర్టీసీ మజ్దూర్‌ అధ్యక్షుడు జయరామిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు నుంచి తిరుపతికి నూతన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్‌ సర్వీసును మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరై, జయప్రదం చేయాలని కోరారు.

కుప్పం మహిళా అధ్యక్షురాలిగా నాజిమా


నియామకపత్రం అందుకుంటున్న నాజిమా

కుప్పం: వైఎస్సార్‌సీపీ కుప్పం మున్సిపల్‌ మహిళా అధ్యక్షురాలిగా నాజిమా మునీర్‌ బాషాను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్‌ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని రాజంపేట ఎంపీ, లోకసభ ప్యానల్‌ స్పీకర్‌ మిథున్‌ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

స్పందన అర్జీలను పరిష్కరించండి


ముత్తుకూరు సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్‌

పెద్దపంజాణి: సచివాలయంలో రోజూ సాయంత్రం 3 గంటల నుంచి 5 వరకు స్పందన కార్యక్రమం నిర్వహించి, వచ్చే అర్జీలను త్వరగా పరిష్కరించాలని ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్‌ సూచించారు. గురువారం ఆయన మండలంలోని ముత్తుకూరు, రాజుపల్లి సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో పీఎస్‌లు శ్రీనివాసులు, సుభాషిణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా రీసర్వే నిర్వహించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్‌ శ్యాంప్రసాద్‌ రెడ్డి

సోమల: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్‌ శ్యాంప్రసాద్‌ రెడ్డి అన్నారు. గురువారం కందూరు పంచాయతీ మిట్టపల్లెలో నిర్వహిస్తున్న రీసర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ రీసర్వేతో భూముల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌ ప్రకాష్‌ బాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

దేవరెద్దుకు ప్రత్యేక పూజలు


గంటావారిపల్లెలో దేవరెద్దును ఊరేగిస్తున్న గ్రామస్తులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కమ్మపల్లె పంచాయతీ గంటావారిపల్లెలో గురువారం కొత్తగా దేవరెద్దును ఎంపిక చేశారు. గ్రామానికి చెందిన యాదవ కులస్తులు ఈ దేవరెద్దుకు పూజలు చేసి గ్రామంలో ఊరేగించారు. ఇకపై ప్రతి శనివారం ఈ ఎద్దుకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత


పట్టుబడిన కర్ణాటక మద్యం, నిందితునితో పోలీసులు

పెద్దపంజాణి: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏఎస్‌ఐ జ్ఞానప్రకాష్‌ తెలిపారు. గురువారం ఏఎస్‌ఐ సిబ్బందితో కలసి ముత్తుకూరు క్రాస్‌లో వాహనాలు తనిఖీ చేపట్టారు. సోమల మండలం వడ్డిపల్లి గ్రామానికి చెందిన గణేష్‌(26) కర్ణాటక మద్యాన్ని తన ద్విచక్ర వాహనంలో తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 96 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి రిమాండుకు పంపినట్లు ఆయన తెలిపారు.

సమాజ సంస్కర్త యోగి వేమన


రామకుప్పం: విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు


వి.కోట : విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు


పెద్దపంజాణి: వేమనకు నివాళులు అర్పిస్తున్న పెద్దవెలగటూరు గ్రామస్తులు

రామకుప్పం: విశ్వమానవుడు వేమన సమాజంలోని అనేక రుగ్మతలను, లోపాలను నిరసించిన గొప్ప సంఘ సంస్కర్త అని వేమన ఫౌండేషన్‌ సభ్యులు కొతారి వెంకటరత్నం అన్నారు. మండలంలోని చెల్దిగానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం వేమన ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరచిన విద్యార్థులు తనూజ, దివ్య, అనూష, కావ్య, హేమలతకు మెడల్స్‌, ప్రశంసాపత్రాలు అందజేశారు.

వి.కోటలో..

వి.కోట: మండలంలోని సి.ఎల్లాగరం ఉన్నత పాఠశాలలో యోగివేమన జయంతి సందర్భంగా విద్యార్థులు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వేమన ఫౌండేషన్‌ అనంతపురం సంస్థ అధ్యక్షుడు అప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి పద్యాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్‌, ప్రశంసా పత్రాలు, వేమన సాహిత్య పద్యాల పుస్తకాలు బహూకరించారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలోని పెద్దవెలగటూరు గ్రామంలో గురువారం యోగి వేమారెడ్డి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మొగిలిరెడ్డి, కృష్ణారెడ్డి, నాగరాజ రెడ్డి, మునస్వామి రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం విశ్వకవి యోగి వేమారెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర బాలాజీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: స్థానిక ఎస్‌కేవీఎన్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో గురువారం యోగి వేమన జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌ గంగాధరం నాయుడు మాట్లాడుతూ తెలుగువారి చరిత్ర, సంస్కృతి సాహిత్యంలో విశిష్టమైన స్థానం కలిగిన మహనీయుడు యోగి వేమన అని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం అధికారి జయరాం పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్‌ మాధవరాజు, ఎంపీడీఓ సుధాకర్‌ ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో స్ఫూర్తినిచ్చే పద్యాలను వేమన రచించారని వారు గుర్తుచేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్‌ రవిచంద్రారెడ్డి, విశ్రాంత ఎంపీడీఓ మునికృష్ణయ్య, సిబ్బంది ఉన్నారు.


బైరెడ్డిపల్లె ఎంపీడీఓ కార్యాలయం వద్ద..


సోమల : మాట్లాడుతున్న ప్రిన్సిపల్‌ గంగాధరం నాయుడు


చౌడేపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో ..

ప్రతి గడపలో సంతోషం కనిపిస్తోంది


64 పెద్దూరులో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ భరత్‌

– ఎమ్మెల్సీ భరత్‌

శాంతిపురం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు కూడా అభివృద్ధి బాటలో సాగుతుండడంతో ప్రతి గడపలో సంతోషం కనిపిస్తోందని ఎమ్మెల్సీ భరత్‌ చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన 64 పెద్దూరు, సోమాపురం గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు అందిన పథకాల వివరాలతో ఉన్న బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కుటుంబాన్ని ఆరా తీసినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తమకు లక్షల్లో కలిగిన లబ్ధిని ఆనందంగా వివరిస్తున్నారని చెప్పారు. టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న వారి కుటుంబాలకు కూడా గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ లబ్ధి చేకూరడంతో వారు కూడా అంతర్మథనంలో పడ్డారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, కురాన్‌, బైబిల్‌గా భావించి సీఎం జగనన్న హామీలను అమలు చేస్తున్నారని చెప్పారు. అందుకే ప్రజలు మూకుమ్మడిగా సీఎంకు అండగా నిలుస్తున్నారని, ఇతర పార్టీల నుంచి పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని తెలిపారు. 64పెద్దూరులో మురుగుకాలువ సమస్యను స్థానికులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకురాగా, తక్షణం సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అదే గ్రామంలో పక్షవాతం బారిన పడిన కోదండాచారిని పరామర్శించి మెరుగైన వైద్యం పొందేందుకు ప్రభుత్వం ద్వారా, తనవంతు సాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో ఎంపీపీ వసుంధర, ఎంపీడీఓ హేమమాలిని, మండల కన్వీనర్‌ బుల్లెట్‌ దండపాణి, నాయకులు కోదండరెడ్డి, విజలాపురం బాబురెడ్డి, ఏవీ జయరాం, ప్రసన్న, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్‌ డైరెక్టర్‌ పెద్దన్న, స్థానిక సర్పంచ్‌ రాధాకృష్ణ, ఎంపీటీసీ యువరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


64 పెద్దూరులో కోదండాచారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ భరత్‌

రుచికరమైన భోజనం అందించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ కేశవపిళ్లె

సోమల: రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని ఎంఈఓ కేశవపిళ్లె తెలిపారు. గురువారం సోమల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివరత్నమ్మ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్‌ నాయకులు

వి.కోట: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ సంస్థ జిల్లా కార్యదర్శి కన్నన్‌ ఆధ్వర్యంలో గురువారం పీఆర్టీయూ క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శులు జైపాల్‌, గురుప్రసాద్‌, రాష్ట్ర నాయకులు దేవరాజులు, ప్రదీప్‌, రవి, యతీష్‌, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం: స్థానిక పీఆర్టీయూ నేతలు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను స్థానిక రీసోర్స్‌ సెంటర్‌ ఆవరణలో గురువారం ఆ సంఘం జిల్లా సహఅధ్యక్షుడు శంకర్‌, మునిరాజారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నందకుమార్‌, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌, నేతలు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డుల పంపిణీ

రొంపిచెర్ల: మండలకేంద్రంలోని పంచాయతీకి చెందిన పలువురు లబ్ధిదారులకు సర్పంచ్‌ ఇబ్రహీంఖాన్‌ బియ్యం కార్డులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం బియ్యంకార్డులు, పెన్షన్లు, పక్కా ఇళ్లు అడిగిన వెంటనే ఇస్తోందన్నారు. గ్రామ పంచాయతీలో కొత్తగా 26 రేషన్‌ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అలాగే ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రెండు కుటుంబాలకు వైఎస్సార్‌ బీమా పథకం కింద ప్రభుత్వం అందించిన రూ.లక్ష చెక్‌ను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సీరాజున్నీసా, నాయకులు కరీముల్లా, ఐడియ కాలేషా, సిబ్బంది పాల్గొన్నారు.


లబ్ధిదారులకు రేషన్‌కార్డులను అందజేస్తున్న సర్పంచ్‌ ఇబ్రహీంఖాన్‌

దుకాణాలు.. హోటళ్లపై దాడులు


కొంగారెడ్డిపల్లెలోని ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్‌ జె అరుణ

చిత్తూరుఅర్బన్‌: నగరంలోని ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్లు, హోటళ్లు, చికెన్‌ సెంటర్లపై నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు గురువారం రాత్రి దాడులు చేశారు. నగరంలో హోటళ్లపై ఇటీవల ఫిర్యాదులు రావడంతో గురువారం రాత్రి కొంగారెడ్డిపల్లె పరిధి లోని పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్లు, చికెన్‌ సెంటర్లపై మున్సిపల్‌ కమిషనర్‌ అరుణ ఆధ్వర్యంలో ఎంహెచ్‌ఓ లోకేష్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ ఆకస్మిక దా డులు చేశారు. వంటశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పనిచేసే సిబ్బంది వ్యక్తిగత శుభ్రత పాటించాలని హెచ్చరించారు. మాంసం, తమ ఇతర ఆహార ఉత్పత్తులను ఫ్రిజ్‌ల్లో ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్లలో ఫుడ్‌ కలర్స్‌, ఇతర హానికర పదార్థాలను నిబంధనలు అతిక్రమించి, వినియోగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్లను మూయిస్తామని హెచ్చరించారు. కొన్నింటికి నోటీసులు జారీ చేశారు. సింగిల్‌ యూస్‌ ప్లాస్టిక్‌ను వినియోగించకూడదన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారులకు జేసీ అభినందన


ఖోఖో క్రీడాకారులను అభినందిస్తున్న జాయింట్‌ కలెక్టర్‌ వెంకటేశ్వర్‌

చిత్తూరు కలెక్టరేట్‌ : ఏపీ తరపున జాతీయ ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొననున్న ఖోఖో క్రీడాకారులను జేసీ వెంకటేశ్వర్‌ అభినందించారు. గురువారం స్థానిక మెసానికల్‌ మైదానంలో శిక్షణ పొందుతున్న ఖోఖో క్రీడాకారులను జేసీ పలకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలన్నారు. చీఫ్‌ కోచ్‌ బాలాజీ మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరిగే పోటీల్లో రాష్ట్ర ఖోఖో జట్టు పాల్గొంటుందన్నారు. ఖేలో ఇండియాలో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏపీ తరపున పాల్గొంటున్న క్రీడాకారులు చిత్తూరులో శిక్షణ పొందుతున్నారన్నారు. వారికి కోచ్‌గా కాకినాడకు చెందిన పాపారావు వ్యవహరిస్తున్నారని తెలిపారు.

అతివేగమే ప్రమాదాలకు కారణం


పుంగనూరు: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో మాట్లాడుతున్న రవాణాశాఖ అధికారి రవీంద్రనాయక్‌


బైరెడ్డిపల్లెలో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐలు


మాట్లాడుతున్న ఎంవీఐ మధుసూదన్‌

పుంగనూరు: రహదారి భద్రతలను పాటించకుండా మితిమీరిన వేగంతో ప్రయాణించడంతో ప్రమాదాలు జరిగి అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని పుంగనూరు రవాణాశాఖాధికారి రవీంద్రనాయక్‌ తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఆయన రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీటీసీ బసిరెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాల్లో అధికంగా యువత ప్రాణాలు కోల్పోతున్నారని, వాహనాలు నడిపే సమయంలో మద్యం సేవించడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడడం, రోడ్డు భద్రతా నియమాలను పాటించకుండా మితిమీరిన వేగంతో వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు వహించి వాహనాలకు ఇన్సూరెన్స్‌లు, పిల్లలకు డ్రైవింగ్‌ లైసెన్సులు పట్ల అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్‌ అసిస్టెంట్‌ పురుషోత్తంరెడ్డి, వాహనడ్రైవర్లు, యజమానులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె : యువత అతివేగంగా వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ఎంవీఐలు మధుసూదన్‌, మురళి అన్నారు. 34వ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం బైరెడ్డిపల్లె చెక్‌పోస్టు కూడలి వద్ద డ్రైవర్లకు అవగాహన కల్పించి, వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ జన్మనిస్తే, హెల్మెట్‌ పునర్జన్మనిస్తుందని, మోటారు వాహనాలు నడిపేనప్పుడు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లలో మాట్లాడుతూ డ్రైవింగ్‌ చేయరాదన్నారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులతో వెళ్లరాదన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మనకు సంబంధం లేకపోయినా అక్కడ ఉన్న వారు వెంటనే స్పందించి గాయపడిన వారిని ఆదుకుంటే ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహక బహుమతులు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు శివకుమార్‌, ఇస్మాయిల్‌ ఖాన్‌, గాయిత్రి, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

కుప్పం: వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని పలమనేరు మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ మధుసూదన్‌ తెలిపారు. గురువారం రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని మురుగన్‌ మహల్‌లో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలమనేరు ఎంవీఐ మాట్లాడుతూ 34వ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వం ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించిందన్నారు. హెల్మెట్‌ ధరించాలని ఎన్నిసార్లు హెచ్చరిస్తున్నా ద్విచక్రవాహన చోదకులు పట్టించుకోకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కుప్పం ఎస్‌ఐలు శివకుమార్‌, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి

రొంపిచెర్ల: కస్తూర్బా గురుకుల పాఠశాల విద్యార్థులు విద్యలో బాగా రాణించాలని ఎస్‌ఎస్‌ఏ పీఓ వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం ఆయన రొంపిచెర్ల కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేజీబీవీలో పేద విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. వీరు విద్యలో రాణించేలా బోధన చేయాలన్నారు. విద్యార్థులకు నిర్వహించే పరీక్షలను వారు ఎలా రాస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. కొందరు విద్యార్థులు బాగా రాస్తున్నారని ఉపాధ్యాయులు తెలియజేశారు. ఇంగ్లిషు, గణితం పరీక్షల జవాబు పత్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులు చాలామంది హాజరు కాకపోవడంతో ఉపాధ్యాయులపై మండిపడ్డారు. వెంటనే విద్యార్థులంతా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇంటర్మీడియట్‌ విద్యార్థులు విద్యాభ్యాసంపై అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ హసన్‌సాహెబ్‌, ఎస్‌ఓ సుజాత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


రొంపిచెర్ల కేజీబీవీలో ప్రశ్నపత్రాలను పరిశీలిస్తున్న పీఓ వెంకటరమణారెడ్డి

వైఎస్సార్‌ బీమా నగదు పంపిణీ

పెద్దపంజాణి: మండలంలోని పొట్టగానిపల్లికి చెందిన శోభారాణి(30) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందింది. ఈ క్రమంలో అంత్యక్రియలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేల వైఎస్సార్‌ బీమా నగదును గురువారం ఆమె భర్త సురేష్‌ బాబుకు స్థానిక సర్పంచ్‌ రమేష్‌బాబు అందజేశారు. మిగిలిన రూ.90 వేలను త్వరలోనే బాధిత కుటుంబానికి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పరంధామ, పీఎస్‌ గణపతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


బీమా పంపిణీ చేస్తున్న సర్పంచ్‌ రమేష్‌ బాబు

ప్రభుత్వ భవన నిర్మాణ పనుల పరిశీలన

పులిచెర్ల(కల్లూరు): మండల కేంద్రమైన పులిచెర్లలో నూతనంగా నిర్మిస్తున్న మల్టీ కాంప్లెక్స్‌ భవనాలు(ఎంపీడీఓ, తహసీల్దారు) కార్యాలయాలను గురువారం జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఈఈ పీఆర్‌ రమణయ్య పరిశీలించారు. రెండు కార్యాలయాలకు సంబంధించి ఒకే భవనంలో ఏర్పాటు చేస్తున్నారు. జరుగుతున్న పనులను పరిశీలించి, ఇంకా అవసరమైన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరలో వీటిని అందుబాటులోకి తేనున్నారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారాం, ఎంపీడీఓ సుగుణమ్మ, తహసీల్దారు అమరనాథ్‌, రామకృష్ణ నాయక్‌, ఇంజినీరింగ్‌ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


పులిచెర్లలో కొత్తగా నిర్మిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దారు కార్యాలయాలను పరిశీలిస్తున్న అధికారులు

గ్రామాల్లో పనులు వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ హరినారాయణన్‌

చిత్తూరు కలెక్టరేట్‌ : నేచురల్‌ రిసోర్స్‌ మేనేజ్‌మెంట్‌ పథకం ద్వారా ఎంపిక చేసిన గ్రామాల్లో పనులను వేగవంతం చేయాలని కలెక్టర్‌ హరినారాయణన్‌ అన్నారు. గురువారం జిల్లాలో డ్వామాశాఖ ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాల పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్‌ఎంఎంఎస్‌ పథకంలో చేపడుతున్న పనులను వేగవంతం చేసి మరింత ఎక్కువమందికి ఉపాధి కల్పించాలన్నారు. గృహ నిర్మాణ పథకంలో మరింత ఎక్కువ మందికి పని కల్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీలు పనిచేసే వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ రోజువారీ వేతనం రూ.246 తగ్గకుండా చూడాలని తెలిపారు. అమృత్‌ సరోవర్‌ ప్రాజెక్టు కింద జిల్లాకు 70 ప్రాజెక్టులు మంజూరు అయ్యాయని చెప్పారు. ఇప్పటివరకు 31 ప్రాజెక్టులు పూర్తి అయ్యాయని తెలిపారు. మిగిలినవి వెంటనే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌ గంగాభవాని, ఏపీడీలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, వరప్రసాద్‌, వెంకటరత్నం, శోభన్‌ బాబు, ప్రియదర్శిని, జయచంద్ర, చంద్రమోహన్‌ పాల్గొన్నారు.

బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్‌ ఐసీడీఎస్‌ అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యవంతమైన శిశు జననానికి, వారు తీసుకోవాల్సిన పోషకాహారం, జాగ్రత్తలపై అంగన్‌వాడీ కార్యకర్తలు మరింత శ్రద్ధ చూపాలన్నారు. సీడీపీఓలు వారి విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో ఎత్తు, బరువు తక్కువ ఉన్న పిల్లల ఆరోగ్య పరిస్థితులకు సంబంధించి చిన్నపిల్లల వైద్య నిపుణుల సూచనలతో వారి ఆరోగ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టాలన్నారు. వైద్యుల సూచనల మేరకు ప్రతి నెలా పిల్లలు బరువు పెరిగేలా వారికి అవసరమైన పోషకాహారం అదనంగా అందించేందుకు కృషి చేయాలన్నారు. సీడీపీఓలు వారి పరిధిలో బరువు తక్కువ ఉన్న పిల్లలను, రక్తహీనత ఉన్న గర్భిణుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. వారికి అవసరమైన వైద్య సలహాలు ఏఎన్‌ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల సాయంతో అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు సచివాలయ స్థాయిలో మహిళా పోలీస్‌, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలతో ఆడపిల్లల్లో తలెత్తే ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచాలని కలెక్టర్‌ సూచించారు.